ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

ఉష్ణోగ్రత (అంచనా)

4-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	26
బాపట్ల	37	27
రెంటచింతల	40	27



నరసరావుపేట మున్సిపల్ బాలుర స్కూల్‌లో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

నాడు-నేడు నాస్పుడు

- పాఠశాలల్లో పనులపై నీలినీడలు
- నిలిచిన పనులతో ఏడాదంతా అవస్థలే
- పనుల పూర్తిపై ప్రభుత్వంలో కొరవడిన స్పష్టత
- విద్యా సంవత్సరం ప్రారంభానికైనా పూర్తి చేయాలని వినతి

నాడు-నేడుతో అద్భుతాలు సృష్టిస్తాం. కార్పొరేట్ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు సమకూరుస్తాం.. అని గత వైసీపీ పాలకులు హడావుడి చేశారు. మొదటి, రెండు విడతలు పేరుతో వేల కోట్లు మంజూరు చేశామని.. వేల పనులు చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే వైసీపీ హయాంలో నిధులు విడుదల కాక.. పనుల సాగలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఆయా పనులు నిలిపేసింది. దీంతో ఏడాదిగా నాడు-నేడు పనులు ముందుకు సాగక అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అనేక పాఠశాలల్లోని తరగతి గదులు నాడు-నేడు సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు చెట్ల కింద, వరండాల్లో బోధన చేయాల్సి వచ్చింది. ఏడాది గడిచినా నాడు-నేడు పనులపై ప్రభుత్వంలో స్పష్టత లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలల్లో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా ఆయా పనులపై నీలినీడలు అలుముకున్నాయి. రానున్న విద్యా సంవత్సరం కల్లా తరగతి గదుల పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధులు ఇవ్వక.. పనులు సాగక

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. అన్ని వసతులు కల్పించాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా పనులు సాగుతాయనుకుంటే నిరాశే మిగిలింది. ఏడాదిగా ఏ ఒక్క బడిలోనూ ప్రగతి పని ముందడుగు పడలేదు. పాఠశాలల్లో మౌలిక వస తుల కల్పన మాటేమో కాని ఏడాదంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో విడతలో చేపట్టిన పనులను కూటమి ప్రభు త్వం పూర్తి చేస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. అనేక ఆరోపణల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మం జూరు చేసినట్లు నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే నిధుల విడుదలలో చతికిలపడింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపి వేశాయి. నాడు నేడు పనుల పూర్తిపై గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నాడు-నేడు పేరుతో అనేక పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేయడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా పాలకుల్లో స్పందన లేకుండా పోయింది. నూతన గదులు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తరగతిగదుల సమస్య నెలకొంది. ఇకమరుగుదొడ్ల నిర్మాణం సాగక ఏడాదిగా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పాఠశాలల్లో

(మిగతా 6వ పేజీలో)



ములకలూరులో పునాదులు దాటని తరగతి గది నిర్మాణం

బీటెక్కే



- ఖాళీగానే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు
- 40 శాతం మంది పట్టభద్రులకు పని లేదు
- కొలువుల కోసం ఉన్నత విద్యావంతుల నిరీక్షణ
- ఉపాధి లేని వారిపై ఇంటింటి సర్వే చేసిన ప్రభుత్వం
- మూడు జిల్లాల పరిధిలో 16,91,432 మంది నిరుద్యోగుల గుర్తింపు
- సాంకేతిక విద్యార్థుల్లో 80 శాతం మందికి ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బీటెక్ చేసినా ఖాళీగానే ఉంటున్నారు. పేరుకు బీటెక్ చదివినా తగిన ఉద్యోగం లేక ఇంటి పట్టున లేదంటే ఏదో ఒక కోర్సు అభ్యసిస్తూ అనేక మంది ఉంటున్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు కూడా అర్హతకు తగిన కొలువు దొరక్క అల్లాడుతున్నారు. ఇక పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా పని చూపితే చేసుకుంటామని ఎదురు చూస్తున్న వారిలో ఎలాంటి విద్యార్హతలు లేని వారు లక్షల్లో ఉన్నారు. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మొదలు పెట్టింది. ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి చేయడానికి ఎటువంటి పనిలేకుండా ఖాళీగా ఉన్న వారి వివరాలను సేకరించింది. విద్యార్హతలు, గతంలో ఏమన్నా పని చేసి మానేశారా.. అనే అంశంతో పాటు ఏ రంగంలో శిక్షణ తీసుకుని రాణిస్తారు.. తదితర అంశాలపై సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం డాటా సేకరించింది. ప్రభుత్వం ఉపాధి చూపెడితే ఇంటి వద్ద నుంచే పనిచేయడానికి ఎంతమందికి ఆసక్తి ఉంది అని అంశంపై కూడా ఆరా తీసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు ప్రామాణికంగా సచివాలయ ఉద్యోగుల చేత ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. మూడు జిల్లాల పరిధిలో 16,91,432 గుర్తించింది. వీరంతా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, తోడ్పాటు కోసమే ఎదురుచూస్తున్నారని నివేదికలో సిబ్బంది పొందుపరిచారు. బాపట్ల జిల్లాలో 5,17,823 వ ంది ని ఉపాధిలేని వారిని గుర్తించగా, గుంటూరు జిల్లాలో ఇది 5,86,100గా ఉంది. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అత్యధికంగా 5,87,609 మంది చేయడానికి పని దొరక్క ఖాళీగా ఉండడమో లేక వారి విద్యార్హతలకు తగిన కొలువు దొరక్క ప్రయత్నాల్లోనే ఉన్నట్లు సర్వేలో తేల్చారు. ఖాళీగా ఉన్నవారిలో దాదాపు 40 శాతం మంది పట్టభద్రులే కాగా ఇందులో కూడా బీటెక్ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారే అధికంగా ఉన్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు 15 శాతం మంది ఖాళీగా ఉంటుండగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో చేస్తున్న కొలువు కోల్పోయిన వారు 15 శాతం మంది ఉన్నట్లు సర్వేలో తేలింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు, ఎలాంటి విద్యార్హతలు లేకుండా ప్రభుత్వం ఏదన్నా పని చూపిస్తే చేసుకుంటామన్న వారిలో మహిళలే అధికంగా ఉండగా మొత్తం నిరుద్యోగుల్లో వీరిది 30 శాతంగా ఉండడం గమనార్హం. సర్వేలో ఉపాధిలేని వారిగా గుర్తించిన వారిలో 80 శాతం మందికి మూ డునెలల వ్యవధిలోనే కొలువు చూపెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

శిక్షణ.. ప్రైవేటు సెక్టార్‌తో అనుసంధానం

సర్వేలో భాగంగా వివిధ విభాగాల మీద ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత కారణంగా వాటిని నేర్చుకోలేకపోయామని పలువురు వెల్లడించారు. తొలుత వారందరికీ ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోనుంది. దీనికి సమాంతరంగా విద్యార్హతలను బట్టి ప్రైవేటు కంపెనీలకు ఉద్యోగార్థులకు అనుసంధానకర్తగా ప్రభుత్వం ఉంటూ వారిని ఉపాధి వైపు నడిపించే కార్యక్రమానికి కసరత్తు మొదలుపెట్టింది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇళ్ల వద్దే ఉపాధి కల్పించే మార్గాల అన్వేషణలో యంత్రాంగం ఉంది. ఇంటి వద్దే తయారు చేసే గృహోపకరణాలు, పచ్చళ్లు, తినుబండారాలు, ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన వంటివన్నీ మహిళల ఉపాధి కల్పనలో భాగం చేయడానికి ప్రభుత్వం సదరు విభాగాలను సమాయత్తం చేసింది.

సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు..

సర్వేలో భాగంగా పని లేకుండా ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పట్టభద్రులపైన ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. తొలుత జిల్లాకు 1000 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లకు కొలువులు చూపెట్టే దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా వారికి కొలువులు కల్పించే పనిని సదరు కంపెనీలు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని త్వరలో జిల్లాలోని ఓ వేదికలో మెగా ఆన్‌లైన్ పరీక్షలను చేపట్టి ఒకేసారి వేల మందికి ఉపాధి చూపెట్టేలా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఈ క్రమంలో ఆయా కంపెనీలకు తగ్గట్టుగా నిరుద్యోగుల్లో నైపుణ్యాలు లేకపోతే వారే అందుకు సంబం ధించిన శిక్షణ ఇచ్చేటట్లు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



వేటపాలెం : కొత్తపేట సచివాలయంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన బీటెక్ గ్రాడ్యుయేట్ (పాత చిత్రం)

రూ.కోట్లతో జీజీహెచ్‌లో సౌకర్యాలు

- రూ.86 కోట్ల ఎంసీహెచ్ బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి
- స్టెప్‌డౌన్ ఐసీయూ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా 15 పడకలతో నూతనంగా నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కోసం నూతనంగా రూపొందించిన లోగోను మంత్రి ఆవిష్కరించారు. జీఎంసీ 80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రామారావు, శారద ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.9 లక్షల విరాళం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు అందజేసిన రూ.10 కోట్ల విరాళంతో వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎస్ఆర్ కింద వచ్చిన రూ.15 కోట్లతో కూడా మరికొన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఐసీయూకు రూ.1.60 కోట్ల విలువైన నాలుగు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, ఆరు మొబైల్ వెంటిలేటర్లను విరాళంగా అందజేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు ఏసీలు, పడకలు అందజేసిన దాతలను పెమ్మసాని అభినందించారు. దాతలు, పారిశ్రామికవేత్తలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నాట్కో వంటి కార్పొరేట్ కంపెనీలు జీజీహెచ్‌ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌లో కొత్తగా ప్రారంభించిన స్టెప్‌డౌన్ ఐసీయూతో మరో 15 పడకలు అదనంగా అందుబాట్లోకి వస్తున్నాయని తెలిపారు. పూర్వ విద్యార్థుల వితరణతో ఆస్పత్రి ఆవరణలో రూ.86 కోట్లతో చేపట్టిన ఎంసీహెచ్ బ్లాక్ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని ప్రకటించారు.

పది నెలల్లో పెరిగిన విశ్వాసం

సాయం చేసేందుకు పలువురు దాతలు సిద్ధంగా ఉన్నా గత వైసీపీ అసమర్థత చూసి ఎవరూ ముందుకు రాలేదని పెమ్మసాని తెలిపారు. పది నెలల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, దీంతో ఎందరో దాతలు ముందుకు వచ్చి గుంటూరు జీజీహెచ్‌లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. జీజీహెచ్‌లో ఏనాడైనా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టిందా అని కేంద్ర మంత్రి నిలదీశారు. పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నశీర్ అహ్మద్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, భాష్యం రామకృష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఆసుపత్రి లోగోను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

రహదారుల పనులు వేగవంతం చేయాలి

నష్టపరిహారం చెల్లింపులు తక్షణమే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓడరేవు- నకిరేకల్, బెంగళూరు-కడప- విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులపై రెవెన్యూ అధికారులతో శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమీక్షించారు. 167-ఏ నిర్మాణంలో కారంచేడు, పర్చూరు, వేటపాలెం, చీరాల మండలాల్లో భూసేకరణ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూములు కోల్పోయినవారికి పరిహారం చెల్లించాలన్నారు. చీరాల మండలంలోని ప్రభుత్వ పోరంబోకులో నివాసం ఉంటున్న 63 గృహాల నిర్మాణాలను తక్షణమే తొలగించాలన్నారు. జాతీయ రహదారి 544-జీ నిర్మాణానికి ఆటంకంగా ఉన్న భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. జెపంగులూరు మండలంలో ప్రజల అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. అద్దంకిలో ఆక్రమణలను తొలగించాలన్నారు. 16వ నెంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పిచ్చుకలగడిపాడు వద్ద సర్వీస్‌రోడ్డు నిర్మాణం కొరకు భూసేకరణ త్వరగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్‌డీసీ లవన్న, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగం పర్యవేక్షకులు సంధ్యారాణి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఎండతో అస్వస్థత.. ఇద్దరు కూలీల మృతి

- చెన్నుపల్లి, ముక్తేశ్వరంలో అలుముకున్న విషాదం

బల్లికురవ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి, ముక్తేశ్వరం గ్రామాలలో శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి ఇద్దరు కూలీలు మృతి చెందారు. ఆయా గ్రామాలకు చెందిన షేక్ జాను(45) మాసాని మల్లికార్జునరావు(23) ఎండ వేడిమితో అస్వస్థతకు గురై మృతి చెందారు. అందిన సమాచారం మేరకు చెన్నుపల్లి గ్రామానికి చెందిన జాను కుమార్తెతో కలిసి పనులకు వెళ్లగా ఉక్కపోత ఎండ వేడిమితో పనుల వద్దే ఊపిరి ఆడక కుప్పకులి పడిపోయాడు. తోటి కూలీలు గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఇరువురు కుమార్తెలు ఉన్నారు. అదేవిధంగా ముక్తేశ్వరం గ్రామానికి చెందిన మాసాని మల్లికార్జునరావు రోజు మాదిరిగానే ఉపాధి పనులకు వెళ్లి అస్వస్థతకు గురై ఫిట్స్ వచ్చాయి. దీంతో పనుల వద్దే మృతి చెందాడు. ఇతడికి వివాహం కాలేదు. రెండు గ్రామాల్లో ఇద్దరు మృతి చెందడంతో కూలీలు బెంబేలెత్తి పోతున్నారు. అధికారులు పనుల వద్ద కూలీలకు వసతులు కల్పించడం లేదని కనీసం నీడ, నీరు, ప్రథమచికిత్స కిట్లను కూడా అందుబాటులోకి తేవడం లేదని కూలీలు వాపోతున్నారు. గత నెలలో కూడా కొండాయపాలెంలో ఓ కూలీ పనులు చేస్తు మృతి చెందిన విషయం విదితమే.



మృతుడు షేక్ జాను



మృతుడు మల్లికార్జునరావు

చిన్నబోతోన్న.. లక్ష్యం

- ధాన్యం సేకరణపై ప్రతిపాదనల పరంపర
- అదనపు అనుమతులపై అన్నదాతలు ఆశలు
- రబీలో 30,000 టన్నులకు ఇప్పటికే 20,160 టన్నుల సేకరణ
- మరో 20,000 టన్నుల సేకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- జీపీఎస్ విషయంలో కొనసాగుతున్న గందరగోళం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గడచిన ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు తొలుత ఇచ్చిన లక్ష్యం చాలక దఫదఫాలుగా యంత్రాంగం ప్రతిపాదనలు పంపడం వాటికి ఆమోదం లభించడంతో రికార్డు స్థాయిలో 91,000 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం సేకరించగలిగింది. ఇప్పుడు రబీ సీజన్‌లో కూడా అదే పరిస్థితి నెలకొనే సూచనలే కనబడుతున్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి తొలుత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు 10,000 టన్నులే కాగా, దిగుబడులకు దీనికి హస్తిమశకాంతరం తేడా ఉండడంతో దానిని 30,000 టన్నుల వరకు పెంచారు. దీంతో ఆ ధాన్యం కూడా పెద్దఎత్తున కొనుగోలు కేంద్రాల బాట పట్టడంతో ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం చిన్నబోయింది. కొనుగోలు కేంద్రాల తెరవక ముందే సేకరణ లక్ష్యం పెంచుకోవడంలో యంత్రాంగం విజయం సాధించింది. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరంభంలో మందకొడిగా సాగిన ధాన్యం సేకరణ ప్రస్తుతం ఊపందుకుంది. దీంతో ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ద్వారా 20,160 టన్నుల ధాన్యం సేకరించారు. దీనికి సంబంధించి రూ.38 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేశారు. మరోవైపు ఇంకా దాదాపు 60,000 టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. మరో వారం రోజుల్లోనే ప్రభుత్వం ఇచ్చిన 30,000 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో 20,000 టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇవ్వాల్సిందిగా సివిల్ సప్లయిస్ విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. అదనంగా ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే గాని రైతులు ఒడ్డున పడే సూచనలు కనబడడం లేదు.



దిగుబడులు 1,08,000 టన్నులు..

రబీ సీజన్‌తో పాటు లేట్ ఖరీఫ్ దిగుబడులు కలుపుకుంటే మొత్తం 1,08,000 టన్నుల వరకు ధాన్యం దిగుబడులు వచ్చాయి. సీజన్ ఆరంభంలో కేవలం రబీ సీజన్ దిగుబడులనే ప్రామాణికంగా తీసుకుని కేవలం 10,000 టన్నుల సేకరణకే ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ లెఫ్ట్ ఓవర్ ఖరీఫ్‌ను రబీకిందే సేకరించాల్సి వస్తుందని మరింతగా అనుమతులు ఇవ్వాలనే జిల్లా అధికారుల అభ్యర్థన మేరకు లక్ష్యాన్ని 30,000 వరకు పెంచారు. సీజన్ ఆరంభం నుంచి లేట్ ఖరీఫ్ ధాన్యం విషయంలో తకరారు నడుస్తూనే ఉంది. దానిని ఈ క్రాప్‌లో ఖరీఫ్ కింద నమోదు చేయడంతో రబీ కింద సేకరించాలంటే సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి సంబంధించి రాష్ట్రస్థాయిలో లెటర్ పెట్టి సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం సేకరించిన 20,160 టన్నుల ధాన్యంలో లేట్ ఖరీఫ్‌దే దాదాపు 15,000 టన్నులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా 60,000 టన్నుల ధాన్యం అన్నదాతల వద్దే ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యంలో మరో 9,840 టన్నులు మాత్రమే మిగిలిఉంది. అదనపు అనుమతు లపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. మద్దతు ధర కన్నా బహిరంగ మార్కెట్‌లో క్వింటాలు ధాన్యం ధర రూ.300 వరకు తక్కువగా ఉంది. ప్రభుత్వం సేకరణలో పెంపునకు అనుమతులు ఇవ్వకపోతే బహిరంగ మార్కెట్‌లో అయిన కాడికి అమ్ముకుని అన్నదాతలు భారీగా నష్టపోయే అవకాశం ఉంది

ప్రతిబంధకంగా జీపీఎస్..

ధాన్యం రవాణాకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం రైతులను ఇంకా గందరగోళానికి గురి చేస్తూనే ఉంది. ధాన్యాన్ని కల్లాల నుంచి మిల్లులకు తరలించే వరకు ఈ వ్యవస్థ పనిచేయనుంది. రవాణాకు తీసుకున్న సమయంతో పాటు కిలోమీటర్లు ఇవన్నీ కూడా పక్కాగా నమోదు కానున్నాయి. ధాన్యం సేకరణలో అవకతవకలను అరికట్టడానికి తీసుకొచ్చిన ఈ విధానంలో క్షేత్రస్థాయి ఇబ్బందులపై దృష్టిపెట్టలేదని తెలుస్తోంది. ధాన్యాన్ని కొందరు రైతులు ఇంట్లో, గోదాముల్లోనో నిల్వ చేసుకుని ఉంటారు. కానీ జీపీఎస్ అనేది నేరగా కల్లాల నుంచే చూపెట్టాలంటే ఎలా అని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగం మానేశాడని గొడవ.. భర్త ఆత్మహత్య



మృతుడు బిల్లా నరసింహారావు

రేపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం మానేయడంతో భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ గొడవలు.. భర్త ఆత్మహత్యకు దారితీశాయి. ఈ ఘటన రేపల్లె పట్టణం లోని చోటుచే సుకుంది. శనివారం పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన బిల్లా నరసింహారావు(30) భార్య సాయిదేవితో కలిసి రేపల్లె పట్టణంలో 2వ వార్డులో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నాడు. స్థానికంగా పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా ఉద్యోగం చేస్తున్నా డు. రెండురోజుల కిందట ఉద్యోగం మానివేయడంతో.. విషయం భార్యకు తెలిసి ఇద్దరి మధ్య గొడవలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన నరసింహారావు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. వీరికి సంతానం లేదు. మృతుడి తండ్రి బిల్లా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నరేంద్ర

రాజసానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పొన్నూరు టౌన్, మే, 3 (ఆంధ్రజ్యోతి): రాజసానికి, పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీకలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బలప్రదర్శన పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ ధృడమైన శరీరం, నడకలో రాజసం, పందెంలో పౌరుషం నింపుకున్న ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన అద్భుతమన్నారు. ఎడ్ల పందేల నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను అభినందించారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తమ కుటుంబాలు పశు సంపదతో మమేకమై ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం మీద ఉన్న మమకారంతో ఒంగోలు జాతి ఎడ్ల పెంపకం కష్టతరమైనప్పటికీ రైతులు వాటిని పోషిస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇలాంటి బలప్రదర్శనల వల్ల ఒంగోలు జాతి ఎడ్ల గొప్పతనాన్ని బతికించే పరిస్థితి ఉందన్నారు. పాడిపరిశ్రమాభివృద్ధి ద్వారా ఒంగోలు జాతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగుపళ్ల విభాగంలో 18 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. యజమానులకు మెమెంటో, బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



బాలకృష్ణ(ఫైల్)

ఫిరంగిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అప్పులు పెరిగి, వాటిని తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కండ్రిక గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గజేంద్ర బాలకృష్ణ (35) ఐదేళ్లుగా ఎనిమిది ఎకరాల్లో పత్తి, మిర్చి పండిస్తున్నారు. ఈ ఏడాది కూడా తన ఎకరం పొలంతో పాటు.. మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పండించాడు. భారీగా నష్టం రావడంతో సుమారు రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీరే దారి కానరాక ఆరు రోజుల క్రితం గడ్డి మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలకృష్ణ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, కావ్య, కుమారుడు కార్తికేయ, భార్య విజయలక్ష్మి ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.00 అడుగులు ఉంది. ఇది 138.56 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్ ఫ్లో 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రూ. 69 కోట్ల.. జడ్పీ బడ్జెట్‌కు మోక్షం

● సమావేశంతో పనిలేకుండానే ఆమోదం

గుంటూరు సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): నాటకీయ పరిణామాల మధ్య స్థానికంగా ఆమోదానికి నోచుకోని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ వార్షిక బడ్జెట్‌కు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి బడ్జెట్ ఆమోదం కోసం అని మార్చి 15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు బాయ్‌కాట్ చేశారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా టీడీపీలో చేరిన నేపథ్యంలో ఆమెను ఇబ్బంది పెట్టేందుకు బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొట్టాలని వైసీపీ ముఖ్య నేతలు వారికి సూచించారు. ఈ నేపథ్యంలో కోరం లేక సమావేశం వాయిదా పడడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. తిరిగి అదే నెల 29న కూడా సమావేశం నిర్వహించాలని భావించినా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో రూ. 69,10,87,000 వార్షిక బడ్జెట్ ఆమోదం పొందకపోతే ఇబ్బంది పడతామని అధికారులు తలలు పట్టుకున్నారు.

చక్రం తిప్పిన చైర్‌పర్సన్ దంపతులు

బడ్జెట్ ఆమోదం పొందకుండా మోకాళ్లొడ్డిన వైసీపీ ముఖ్య నేతల ఆనందానికి జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు అడ్డుకట్ట వేశారు. బడ్జెట్ ఆమోదానికి స్థానికంగా ఉన్న ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచనలతో బడ్జెట్‌ను వెనువెంటనే ప్రభుత్వానికి పం పారు. చైర్‌పర్సన్ కార్యాలయం సిబ్బంది ఒకటి రెండు సార్లు కమిషనర్‌ను కలిసి బడ్జెట్ ఆమోదం ప్రక్రియను వేగవంతం చేశారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదింప చేసుకోవడంలో సఫలీకృతులయ్యారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ న్యాయవాది వైకే

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): శాంతియుత చర్చలకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని కమ్యూనిస్టు, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. గుంటూరులోని కొత్తపేటలోని సీపీఐ మల్లయ్య లింగం భవన్‌లో శనివారం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. శాంతియుత చర్చలకు సిద్ధం కాకుండా ఆదివాసీలను చంపుకుంటూ పోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికే కాక మానవత్వానికి కూడా వ్యతిరేకమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దిశగా కృషి చేయాలని కోరారు. వారికి శాంతి కమిటీ త్వరలో కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశం తీర్మానించింది. గుంటూరు జిల్లా స్థాయిలో ఏర్పడిన ఈ కమిటీ రాష్ట్రస్థాయిలో ఏర్పడబోయే కమిటీతో సమన్వయంతో పనిచేయాలని తీర్మానించింది.కోలా నవజ్యోతి, సీనియర్ న్యాయవాది వైకే, సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్ కుమార్,కోట మాల్యాద్రి పలువురు ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

కులగణనపై రాజకీయాలు సరికాదు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటే దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హితవుపలికారు. మంగళగిరిలోని



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు కులగణన చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆనాటి బ్రిటీష ఇండియా.. భారతీయ కుల సమాజంపై స్పష్టమైన అవాహనతోనే పదేళ్లకోసారి జనగణనతో పాటే 1931 వరకు కులగణన కూడా జరిపించారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు భారత పాలకులు మాత్రం జనాభా లెక్కలతోపాటు వివిధ కులాల జనాభా లెక్కలు తీయించలేకపోవడం దురదృష్టకరమని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంటీసీ మూర్తి నేతలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ఉచితంగా వాటర్ బాటిల్స్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా రైళ్లలో ముఖ్యంగా జనరల్ బోగీల్లో ప్రయాణికులకు రైల్వే శాఖ ఉచితంగా వాటర్ బాటిల్స్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. దాతల సహకారంతో మధ్యాహ్నం వేళల్లో గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అన్ని స్టేషన్లలో ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ఎన్‌జీవోలు ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నారు. అలానే రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫాంలపై కుండలు ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. శనివారం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ ఆదేశాల మేరకు రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, నంద్యాల తదితర రైల్వేస్టేషన్లలో వాటర్ బాటిల్స్ పంపిణీ చేయించారు. ఎండలు తగ్గేంత వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన చెప్పారు. దాతలు ముందుకొచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న డీసీఎం కమలాకర్‌బాబు

నాటుసారాపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

క్రోసూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులు, అమ్మకం దారులు తీరు మార్చుకోక పోతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన సందర్శించి, నేరాలపై సమీక్షించారు. స్టేషన్



క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నాటు సారా నిర్మూలనకు 2.0 కార్యక్రమాన్ని సమసర్థంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకు మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి.. వారి సహకారంతో నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నేరస్తు లపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని, అటవీ ప్రాంతాలు, తండాల్లోనూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లోని కేసుల వివరాలను పరిశీలించారు. మద్యం షాపులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, నిబంధనలు, ఎమ్మార్పీ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.మణికంఠ, సీఐ తులసీ ఉన్నారు.

నాడు - నేడు.. నాన్చుడు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్, తాగునీటి వసతి, పర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగ తి గదులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు. భవనాలకు రంగులు తదితర పనులు అరకొరగానే సాగగా పెండింగ్ పనుల ఊసే లేకుండా ఏడాది ముగిసింది. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా పనులపై ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొరగానే పనులు పూర్తి..

- పల్నాడు జిల్లాలో 1298 పాఠశాలల్లో రూ.312 కోట్లు వ్యయ అంచనాతో 8,330 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 26 ప్యాకేజీల్లో మాత్రమే నిర్మాణాలు జరిగాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాకల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 352 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 91 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉండగా 29 మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 మాత్రమే పూర్తయ్యాయి. 913 మరమ్మతుల పనులకు 284 పూర్తి చేశారు.
- గుంటూరు జిల్లాలో 919 బడుల్లో రూ.203.94 కోట్ల వ్యయ అంచనాతో 6,523 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పది ప్యాకేజీల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాకల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. 100 పాఠశాలల్లో ప్రహరీలకు 25 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 264 పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 191 పూర్తి చేశారు.
- బాపట్ల జిల్లాలో 944 స్కూల్స్‌లో 183.31 కోట్ల వ్యయ అంచనాతో 6,274 చేపట్టాలని నిర్ణయించారు. 112 స్కూళ్లలో 96 ప్యాకేజీల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాకలను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 163 చోట్ల పూర్తి చేశారు. 78 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు కాగా తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 327 పనులు చేపట్టగా 215, మరమ్మతుల పనులు 586 చేపట్టగా 157 మాత్రమే పూర్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

స్వర్ణ ప్రకాశ రూపిణిగా శ్రీ బగళాముఖి అమ్మవారు

● బంగారు ఆభరణాలను శోభాయాత్రగా తీసుకొచ్చిన ఎమ్మెల్యే వేగేశన



శ్రీ స్వర్ణ ప్రకాశ రూపిణి అలంకరణలో శ్రీ బగళాముఖి అమ్మవారి

పిట్టలవానిపాలెం,మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ళ మహోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శ్రీబగళాముఖి అమ్మవారిని శ్రీ స్వర్ణ ప్రకాశరూపిణిగా విశేష అలంకారం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. 2002 సంవత్సరంలో అప్పటి తవ్వకాలలో బయటపడిన ప్రాచీన సువర్ణ బంగారు ఆభరణాలు, వర్ణమాత్రక సువర్ణహారం, సౌభాగ్యతిలకహారంలతో కూడిన అమ్మవారికి చెందిన బంగారపు ఆభరణాలను చందోలు స్టేట్‌బ్యాంక్ నుంచి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రత్యేక మేళతాళాలతో శోభయాత్రగా అలయానికి తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు ఈ ఆభరణాలను శ్రీబగళాముఖి అమ్మవారికి అలంకరించారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా అవసరమని అన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలానికి భూమి అవసరమని ఆలయ కార్య నిర్వహణాధికారి నరసింహమూర్తి తెలుపగా దీనికి స్పందించిన భక్తులు తెర్లపాటి శ్రీనివాసరావు రూ.2 లక్షలు, సనకా రాఘవవంశీ రూ2 లక్షలు, నెల్లూరుకు చెందిన డి.సింగ్ రూ.లక్ష, శివకుమార్ రూ.లక్ష చొప్పున అమ్మవారికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పిట్టలవానిపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్, చందోలు-2 సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, ఏఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం.భాగ్యలక్ష్మి, వడ్రాణం మార్కండేయులు, బాపట్ల రూరల్ సీఐ పి.హరికృష్ణ, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, బాపట్ల డివిజన్ దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్, పంచాయతీ కార్యదర్శి బి.సుజాత, వీఆర్వో అరుణ ప్రసన్న, ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బంగారు ఆభరణాలను శోభయాత్రగా తీసుకొస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, అధికారులు, భక్తులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థల సహకారంతో అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తూ బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. మండల లీగల్ సెల్ అథారిటీ, చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయ సమావేశం శనివారం నిర్వహించారు. క్రాఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ఫ్రాన్సీస్‌తంబి అధ్యక్షతన యాత్రి నివాస్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జడ్జి వాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచటానికి జిల్లా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు. అసిస్టెంట్ లేబర్‌కమిషనర్ డీవీ.శివప్రసాద్ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా కార్మికశాఖ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ సీఐ ఆర్.రాంబాబు మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు గురించి ఫిర్యాదు అందిన వెంటనే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటక్షన్ ఆఫీసర్ పి.పురుషోత్తం, డిప్యూటీ డీఈవో సురేష్, సీఫార్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్, సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, డీసీపీ యూనిట్ ప్రతినిధులు, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

పసుపులేటి కొండలుస్వామి దంపతులకు సన్మానం

కర్లపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కర్లపాలేనికి చెందిన పసుపులేటి కొండలుస్వామి రఘుకుల తిలకరారా పాటను ఆలపించి దేశవ్యాప్తంగా పలువురి మన్ననలను అందుకొని జిల్లా ఖ్యాతిని పెంచారు. ఈ సందర్భంగా కర్లపాలెంలోని శ్రీకాళీకమ్మతల్లి దేవాలయంలో శనివారం కొండలుస్వామి, ఏడుకొండలమ్మ దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో తెలుగుదేశం పార్టీ నాయకులు భోజరాజు, శ్రీనివాసరెడ్డిలు దుశ్శాలువా, పూలమాలలతో అభినందించి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కట్టా సుజాత, పానుగంటి సురేష్‌బాబు, ఏట్ర వెంకటేశ్వరరెడ్డి, కొక్కిలిగడ్డ రామరాజు పాల్గొన్నారు.



కొండలుస్వామి దంపతులను సన్మానిస్తున్న భోజరాజు, చీరాల శ్రీనివాసరెడ్డి

అద్దె భవనంలో గ్రంథాలయం

● పాఠకులు లేక వెలవెలబోతున్న రీడింగ్ రూంలు

● స్థలం ఉన్నా భవన నిర్మాణం ప్రశ్నార్థకం



చెక్క బీరువాలకే పరిమితమైన గ్రంథాలయంలోని పుస్తకాలు

రేపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘంలోని చంద్రమౌళిపార్కులో 1960వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ భవనం శిథిలమై కూలిపోయింది. ఎంతో ఘన చరిత్ర కలిగిన గ్రంథాలయ భవనం కనుమరుగైంది. 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు దాసరి కృష్ణకుమారి కాంప్లెక్స్ అద్దె భవనంలోకి మార్చారు. వైసీపీ ఐదేళ్ళపాలనలో గ్రంథాలయ భవన నిర్మాణానికి దృష్టిసారించిన దాఖలాలు లేవు. నూతన భవన నిర్మాణానికి పరుచూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పరుచూరి శ్రీనాథ్ రూ.20 లక్షల నిధులు సమకూరుస్తామని హామీనిచ్చారు. పక్కా భవన నిర్మాణానికి ఆ నిధులు చాలవని ప్రత్యేక గ్రాంటుతో ఆధునిక టెక్నాలజీతో గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తామని హామీనిచ్చారే తప్ప నేటికీ అమలైన దాఖలాలు లేవు. ప్రస్తుత గ్రంథాలయంలో నలుగురు సిబ్బంది ఉండాలి కానీ, ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. రోజూ 40 మంది మాత్రమే పాఠకులు వస్తున్నారు. గ్రంథాలయంలో కొత్తపుస్తకాలు వచ్చిన దాఖలాలులేవు. టెట్, డీఎస్సీకి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో లేవు. ఆరు తెలుగు పత్రికలు, నాలుగు ఇంగ్లీషు పత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు మరో 16 వస్తున్నాయి. 2900 మంది సభ్యత్వం పొందియున్నారు. ప్రధాన పత్రికలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. పక్కా భవనం లేకపోవటంతో పుస్తకాలు పెట్టుకునేందుకు ఐరన్ సెల్ఫ్‌లు లేవు. గ్రంథాలయం స్థాపించినప్పుడు ఉన్న చెక్క బీరువాలోనే పుస్తకాలు పెట్టి ఉన్నాయి. కొన్ని పుస్తకాలకు సరైన సంరక్షణ లేకపోవటంతో పాడైపోయాయి. ప్రస్తుతం 24,033 వివిధ రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా గ్రంథాలయంపై దృష్టిసారించి పక్కా భవనాన్ని నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నేటి నుంచి భావదేవుని బ్రహ్మోత్సవాలు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇలవేల్పు, చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆదివారం ఉదయం తిరుమంజనోత్సవంతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఈనెల 19వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్త దేశిరాజు వెంకటరమణబాబు, ఈవో దివి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతిరోజు భావదేవుడు ప్రత్యేక వాహనంపై నగరోత్సవం చేస్తారు. ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి తర్వాత శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 12వ తేదీన స్వామివారి దివ్యరథోత్సవం (బాపయ్య పౌర్ణమి) జరుగుతుంది. అదేరోజు శ్రీభావపురి అయ్యప్ప సేవాసంఘం ఆధ్వర్యంలో అన్న సంతర్పణ జరుగుతుంది. 19వ తేదీన స్వామివారి 16 రోజుల పండుగ సాయంత్రం సహస్ర దీపాలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయి. ఇప్పటికే ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖాధికారులతో కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు.

ఘనంగా శ్రీ సీతారాముల ఆలయ వార్షికోత్సవం



వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

కర్లపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గౌడపాలెంలోని శ్రీసీతారాముల ఆలయ తృతీయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట అప్పలచార్యులు, బండాత్మకూరు రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత, పంచామృతస్నపన, విశేష హారతులు, శాంతికల్యాణం, మంత్రపుష్ప పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పూజలలో పాల్గొని శ్రీసీతారాములను దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏమినేని శంకర్, సురేష్, మాడా శ్రీనివాసరావు, మునిపల్లె చిన్న, నక్కల వెంకటస్వామి, షేక్ బాజి, నూరినేని మురళీకృష్ణ, నరాల పున్నయ్య, వీరబ్రహ్మయ్య, మాడా బుజ్జిలు తదితరులు పాల్గొన్నారు.

విశేష అలంకరణలో అమ్మవారి ఊరేగింపు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెరువుజమ్ములపాలెం గ్రామంలో ఉన్న త్రీ శక్తి ఆలయంలో శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ తిరునాళ్ళ మహోత్సవంలో భాగంగా శనివారం అమ్మవార్లకు విశేషపూజ, అర్చనలు, పూల అలంకరణ చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని కొల్లావారి ఇంటి నుంచి పసుపు కుంకుమ బండ్లు అనంతరం గ్రామోత్సవం కన్నులపండుగగా జరిపారు. అమ్మవారి వేషధారణతో, కనకతప్పెట్ల మేళతాళాలతో ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

అన్నక్యాంటీన్‌లో ఆహార నాణ్యత పరిశీలించిన కమిషనర్

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : పేదప్రజలకు నిరంతరం అల్పాహారంతోపాటు ఆహారం అందిస్తున్న అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి శనివారం సందర్శించారు. క్యాంటీన్‌లో ప్రజలకు అందిస్తున్న ఆహార నాణ్యతను తిని రుచి చూచి పరిశీలించారు. ఆహార నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 23వ వార్డు వివేకానందకాలనీతోపాటు పలు వార్డులలో పర్యటించి పారిశుధ్యం పనులను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రదర్శన

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు టూరిస్టులపై జరిపిన దాడిని నిరసిస్తూ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని బాపట్ల రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ప్రదర్శన నిర్వహించారు. కొత్తబస్టాండ్ దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బొట్టు కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

చుండూరు (వేమూరు), మే 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని చుండూరు మండలంలో ఆదివారం ఉదయం బాపట్ల పార్లమెంటరీ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపారు. చుండూరు, మోదుకూరు గ్రామాల మధ్య రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర ప్రభుత్వ నిధులు సమకూర్చారు. వాటి పనులు పరిశీలించేందుకు ఉదయం 9 గంటలకు ఇరువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. చుండూరు మండల పరిధిలోని టీడీపీ, జనసేన, బీజే పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు

భట్టిప్రోలు (కొల్లూరు), మే 3 (ఆంధ్రజ్యోతి) : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ, 5న రుద్ర చండీ హోమం లీలావేణుగోపాల శర్మ బృందంచే నిర్వహించబడుతుందన్నారు. హోమ పూజల్లో 33 మంది దంపతులు పాల్గొంటారన్నారు. 6న ఆర్యవైశ్య మహిళలు, కన్యలచే తీసుకు వచ్చిన బిందె తీర్థంతో అమ్మవారి మూలవిరాట్‌కు నవరస ఫల సహిత పంచామృతాలతో సహస్ర కలశాభిషేకం చేస్తారన్నారు. రాత్రి 7 గంటలకు అమ్మవారికి మల్లెపూలతో పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. 7న సాయంత్రం 4 గంటలకు అమ్మవారి దివ్య రథ మహోత్సవం ప్రారంభం అవుతుందని, పూజల్లో ఐదుగురు దంపతులు పాల్గొంటారన్నారు. రథోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విచ్చేయనున్నట్లు చెప్పారు. రాత్రివేళ అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన, అనంతరం అమ్మవారికి ఊయల సేవ జరుగుతుందన్నారు.

కర్లపాలెంలో శ్రీకాళికమ్మతల్లి ఉత్సవాలు



శ్రీకాళికమ్మ, వీరభద్రస్వామి

కర్లపాలెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో శ్రీకాళికమ్మ తల్లి అమ్మవారికి తిరునాళ్ళ మహోత్సవాలను శనివారం ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకాళికమ్మ అమ్మవారిని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా అలంకరించి భారీమేళతాళాలతో భక్తిగీతాలు ఆలపిస్తూ కర్లపాలెం పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. శ్రీకాళికమ్మ తల్లి ఆలయాన్ని విద్యుత్ అలంకరణ చేసి ఆలయం ముందు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏట్ర వెంకటేశ్వరరెడ్డి, కొక్కిలిగడ్డ రామరాజు, సాంబిరెడ్డి దంపతులు, కట్టా సుజాత పర్యవేక్షించారు.

ప్రమాదవశాత్తు ఆర్మీ జవాను మృతి



నరేష్ (ఫైల్)

అమృతలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదశాత్తు ఆర్మీ జవాను మృతి చెందాడు. మండల కేంద్రం అమృతలూరుకు చెందిన నార్ల నరేష్ (36) పంజాబ్ రాష్ట్రంలోని పఠాన్‌కోట్ ఆర్మీలో సీఎంపీగా పని చేస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా ప్రమాదశాత్తు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వచ్చే ఏడాది ఉద్యోగ బాధ్యతల నుంచి విరమించుకునేందుకు ఆర్మీ అధికారులకు లిఖితపూర్వక పత్రాలను కూడా అందజేసినట్లు బంధువులు చెప్పారు. ఇంతలో ఇలా విషాదం జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. నరేష్ మృతి వార్త గ్రామంలో తెలియడంతో విషాదచాయలు అలుముకున్నాయి. నరేష్‌కు భార్య ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. శని వారం మండల పరిధిలోని క్రాప గ్రామానికి చెందిన మునిపల్లి మార్తమ్మ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ, వైద్యానికి అవసరమైన ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి ఎల్‌ఓసీ రూపంలో రూ.3 లక్షలు మంజూరు చేయగా, మంజూరైన మొత్తాన్ని గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో మార్తమ్మ కుటుంబ సభ్యు లకు ఎమ్మెల్యే అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు తమ కృతజ్ఞతలు తెలిపారు.

రేపల్లె టీడీపీ కార్యాలయంలో...



చెక్కును అందజేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, మే3(ఆంధ్రజ్యోతి) : వైద్యం చేయించుకోలేని పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహాయనిధి నుంచి లక్షలాది రూపాయలను వెచ్చించి బాధితులను ఆదుకుంటున్నారని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 43 మంది బాధితులకు రూ.40లక్షలు విలువచేసే సీఎం రిలీఫ్‌ఫండ్‌చెక్కులను శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు మంత్రి అనగాని సత్యప్రసాద్ అండగా ఉంటూ వారిని ఆదుకుంటున్నారన్నారు. గత ఐదేళ్ళ కాలంలో ఒక్క బాధితుడికి కూడా న్యాయం చేసిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే వందలాది మంది బాధితులకు కోట్లాది రూపాయల ఆర్థికసహాయాన్ని పదినెలల కాలంలోనే అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, చింతల సుబ్బారావు, తొట్టెంపూడి సుభాష్, తెనాలి క్రాంతిసుమంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి ఎస్వీడీ వెన్నెల

రేపు మెగా లోక్ అదాలత్

రేపల్లె, మే 3(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీన మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్వీడీ వెన్నెల తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో సర్కిల్‌పరిధిలోని సీఐలకు, ఎస్ఐలకు సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సత్వరమే న్యాయం జరిగేందుకు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించబడతాయని, మీ పరిధిలో ఉన్న క్రిమినల్, సివిల్ తదితర కేసులు పరిష్కరించుకునేందుకు ఈ జాతీయ లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని డివిజన్‌లోని పోలీస్ అధికారులు సూచించారు. అనంతరం సబ్ జైల్‌ను తనిఖీ నిర్వహించి ఖైదీలను వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవిసాయిశ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గీతాభార్గవి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐలు మల్లికార్జున్‌రావు, ఎస్ఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గరికపాటి వెంకటగిరిధర్, సెక్రటరీ యాశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ వేడుకలు

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద శనివారం ఏఐవైఎఫ్ 66వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మేకల బిజిలిబాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించగా అక్కడ జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు తన్నీరు సింగరకొండ పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మామిడిబత్తుల వెంకటేశ్వర్లు, రత్నబాబు, ఫణేంద్ర, సతీష్, తన్నీరు ర్యాన్ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ అయిన వేములపల్లి జిష్ణుమెహర్ S/o. శ్రీనివాస్, తెనాలి, రజకపేట వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియ చేయునది ఏమనగా!

నా క్లయింటు తాతగారైన యలవర్తి శ్రీరామయ్య గారు నా క్లయింట్‌కు మూల్పూరు గ్రామంలోని షుమారు 25 సెంట్లు విస్తీర్ణం గల గోడౌన్ మరియు మూల్పూరు గ్రామంలోని 26 సెంట్లు మాగాణి భూమిని సదరు శ్రీరామయ్య గారిని చివరి రోజులలో నా క్లయింట్ శ్రీరామయ్య గారిని బాగోగులు చూచినందు వలన పైన తెలియచేసిన ఆస్తిని నా క్లయింట్‌కు వీలునామా ద్వారా చెందచేసినాడు. తదుపరి నా క్లయింట్ సదరు గోడౌన్ మరియు 26 సెంట్ల భూమిని స్వాధీన పరచుకొనియున్నాడు. సదరు గోడౌన్‌కు తాళము వేసి సిసి కెమెరాను ఏర్పాటు చేసి పై ఆస్తులను స్వాధీనంలో యుండి యున్నాడు. కావునా ఈ విషయము యావన్మందికి తెలియచేయుటమైనది.

తెనాలి.
03.05.2025

ఇట్లు : జి. శ్రీనివాసరావు,
అడ్వకేట్, తెనాలి.
సెల్ : 9440530871



పాత మున్సిపల్ కార్యాలయ భవనం తొలిగించిన ప్రాంతంలో పెరిగిపోయిన ముళ్ళచెట్లు, పొదలు (ఫైల్)



ముళ్ళచెట్లు తొలిగించి అందమైన పార్కుగా అభివృద్ధి చేసిన చిత్రం

ఆహ్లాదం పంచుతున్న పార్కు

● మున్సిపల్ కార్యాలయంలో నాడు దుర్గంధం.. నేడు పచ్చదనం

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో అందమైన పార్కు రూపుదిద్దుకుంది. ఒకప్పటి మున్సిపల్ పాత కార్యాలయ భవన సముదాయం శిథిలమవ్వటంతో దానిని తొలిగించి మెటీరియల్ మొత్తం బయటకు తరలించారు. దీంతో ఆ ప్రాంతం లోలెవల్ ఏర్పడటంతోపాటు పురపాలక సంఘానికి సంబంధించి పనికిరాని, శిథిలమైన వాహనాలను పెట్టారు. దీంతో ఆ ప్రాంతమంత పెద్దఎత్తున ముళ్ళచెట్లు పొదలు పెరిగిపోయి దుర్గంధపూరితంగా మారింది. దీనికితోడు విషపురుగులు, పాములసంచారం పెరిగిపోయింది. గతపాలకులు దీనిని ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆప్రాంతంలో ఉన్న పనికిరాని వాహనాలు మొత్తం బయటకు పంపించి ముళ్ళచెట్లు, పొదలు మొత్తం శుభ్రం చేయించి డివైడర్‌ల మధ్య ఎక్కువగా ఉన్న మట్టిని తీసుకొచ్చి ఇక్కడ లెవలింగ్ చేయించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ అందంగా ఉండేవిధంగా పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పచ్చటిచెట్లు, విద్యుత్ దీపాలతో చూడచక్కగా పార్కును అభివృద్ధి చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వచ్చే వారు ఇంతలోనే ఎంత మార్పు.. అందమైన పార్కు ఆహ్లాదంగా ఉందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్కు మధ్యలో ఉన్న చెట్ల వద్ద రచ్చబండలాగా కట్టించారు. దీంతో కార్యాలయానికి వచ్చేవారు చెట్ల కింద సేద తీరుతున్నారు. రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న చంద్రకళా పార్కు, మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కుకు కలిపి సుమారు రూ.10 లక్షలు వెచ్చించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. పార్కులోని మొక్కలు పెరిగి మరింత అందంగా మారుతుందని కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డిలు తెలిపారు.

చంద్రబాబు విజన్‌తో అమరావతిలో తిరుగులేని ప్రగతి : కొల్లా

బాపట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ విచ్చేసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో భుజం కలిపి నడిచి ఏపీని అధునాతన ఆంధ్రప్రదేశ్‌గా మార్చటంలో సంపూర్ణ సహకారం అందిస్తామని లక్షలాది మంది ప్రజల సమక్షంలో అభయం ఇవ్వటం హర్షణీయమని శనివారం సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. గత వైసీపీ పాలనలో నాశనమైన ఆంధ్రుల ఆత్మగౌరవ అభ్యుదయ రాజధాని అమరావతి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతోనే ప్రాణం పోసుకుందన్నారు. దేశంలోనే మొదటిసారిగా అమెరికాలోని సిలికాన్ వ్యాలీలాగా అమరావతిలో తొలి టెక్ పార్క్ క్వాంటమ్‌వ్యాలీ, ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుతో వచ్చే జనవరి 1న ప్రారంభం కావటం రాజధాని ప్రగతికి, ప్రతిష్ఠతకు తిరుగులేని నిదర్శనమని కొల్లా పేర్కొన్నారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా సుష్మా

బాపట్ల ఏరియా వైద్యశాలలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ జనరల్ మెడిసిన్ విభాగంలో డాక్టర్ సుష్మా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్దార్థ తెలిపారు.

అవీ..ఇవీ..

నీట్ - 2025 పరీక్షపై అప్రమత్తం

- అధికారులతో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సమావేశం
- పరీక్షకు హాజరుకానున్న 416 మంది విద్యార్థులు



పరీక్ష నిర్వహణపై సమీక్షిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో జరిగే నీట్ - 2025 పరీక్షపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. నేడు స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నీట్ పరీక్షలు జరుగనున్నాయి. అందుకు సంబంధించి వివిధ ప్రాంతాల నుంచి 416 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈనేపథ్యంలో శనివారం ఆర్డీవో ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను పరీక్షకేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 1:30.ని సమయంలో గేట్లు మూసివేయనున్నట్లు వివరించారు. అయితే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ తప్పనిసరిగా సూచించారు. అలాగే మూడు పేజీల సెల్ఫ్ డిక్లరేషన్, అందులోని రెండో పేజీలో పోస్ట్ కార్డు సైజ్ పాస్ ఫోటో అంటించి ఉండాలన్నారు. అలాగే పరీక్షకు హాజరయ్యే వారికి ఎటువంటిసౌకర్యం కలుగకుండా తగు సూచనలు చేశారు. విద్యార్థులు హెల్ప్ డెస్క్ 9948026554, 7569721099, 7032111794, 7416168278 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో కే.పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ, సీఐలు సుబ్బారావు, నాగభూషణం, పలువురు ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పాత రికార్డుల కంప్యూటరీకరణ

- శింగరకొండలో 55 ఏళ్ల నుంచి రికార్డుల కంప్యూటరీకరణ



రికార్డులు కంప్యూటరీకరిస్తున్న సిబ్బంది

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పాతరికార్డులు కంప్యూటరీకరణ పనులు జరుగుతున్నాయి. రికార్డులు చినిగిపోయి భవిష్యత్‌లో సమచారం అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ సమాచారం మొత్తాన్ని సంవత్సరాల వారీగా కంప్యూటరీకరణ చేస్తున్నట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు. 1970 సంవత్సరం నుంచి అందుబాటులో ఉన్న వివాహం, శాశ్వత అభిషేకము, శాశ్వత ఆకుపూజలు, శాశ్వత అన్నదానంకు విరాళాలు ఇచ్చిన భక్తుల వివరాలను రసీదుల ఆధారంగా నమోదు చేస్తున్నారు. ప్రతి సంవత్సరానికి ప్రత్యేక ఫోల్డర్ ఏర్పాటు చేసి, వివరాలతో పాటు సంబంధిత రసీదులు కూడా స్కాన్ చేసి భద్రపరుస్తున్నట్లు తెలిపారు. గత 20 రోజులుగా 12 మంది కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతీయువకలను కేటాయించి కంప్యూటరీకరణ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.7వేల రసీదులు కంప్యూటీకరణ చేసినట్లు తెలిపారు. భక్తులు ఎప్పుడు వచ్చి సమాచారం అడిగినా రికార్డుల ఆధారంగా అందజేసేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రధానంగా వివాహ సర్టిఫికేట్‌లు, దాతల వివరాలు గుర్తించేందుకు మరింత వీలు కలుగుతుందని ఈఓ తిమ్మానాయుడు తెలిపారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠమహోత్సవం

అద్దంకిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుకొమ్ముపాలెంలో కాశీవిశ్వేరస్వామి ఆలయంలో ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్ఠమహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులు హోమంలో, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ మహోత్సవానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలకరణలో నవగ్రహాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అర్ధంతరంగా నిలిచిన ఎత్తిపోతల పథకం

- వైసీపీ ప్రభుత్వంలో చెల్లింపులు లేక నిలిచిన పనులు
- మంత్రి రవికుమార్ చొరవతో తిరిగి ప్రారంభంకానున్న పనులు

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో ఆశగా ఎదురుచూసిన ఉప్పలపాడు ఎత్తిపోతల పథకానికి నాటి వైసీపీ ప్రభుత్వ నీళ్ల చల్లింది. సాగునీటి రంగంపై నిర్లక్ష్యంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆరేళ్లుగా బిల్లులు చెల్లింపు లేక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అద్దంకి మండలంలోని ఉప్పలపాడు, మైలవరం గ్రామాల పరిధిలోని సుమారు 2500 ఎకరాల ఆయకట్టు భూములతో పాటు రెండు గ్రామాల చెరువులకు నీరు నింపే విధంగా సుమారు రూ.15 కోట్ల వ్యయంతో ఉప్పలపాడు ఎత్తిపోతల పథకం రూపకల్పన చేశారు. గుండ్లకమ్మ నది నుంచి సుమారు 2.750 కి.మీ దూరం మెయిన్ పైప్ లైన్ ఏర్పాటు చేసి అక్కడ నుండి రెండు వైపులా సబ్‌పైప్‌లైన్లు ఏర్పాటు ద్వారా పొలాలకు సాగునీరు, చెరువులు నింపేందుకు నీరు విడుదల చేసే విధంగా చేశారు. గుండ్లకమ్మ నదిలో ఇన్‌టెక్‌వెల్ నిర్మాణం, సుమారు 2 కి.మీ దూరం మెయిన్ పైపులైన్ నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా మిగిలిపోయిన 750 మీటర్ల మెయిన్ పైప్‌లైన్, సబ్‌పైప్‌లైన్లు, మోటార్లు, మోటార్ల పంప్‌హౌస్ ఏర్పాటు చేయాల్సి ఉంది. గత టీడీపీ హయాంలో 2018లో పనులు ప్రారంభం కాగా కొద్దినెలలకే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లులు చెల్లింపులు ఆగిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో బిల్లుల చెల్లింపు చేయలేదు. దీంతో పనులు పునఃప్రారంభం కాలేదు. అదేసమయంలో గుండ్లకమ్మనదిలో బావి నిర్మాణం వద్ద ఉన్న జనరేటర్, ఇతర నిర్మాణ సామగ్రి కూడా చోరీకి గురయ్యింది. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీటిరంగానికి ప్రాధాన్యం ఇవ్వడంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల ఐడీసీ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లుల చెల్లింపుతో పాటు మిగిలిన పనులకు సంబంధించి వ్యయం పెరిగినందు న మరోసారి అంచనాలు రూపొందించాలని కాంట్రా క్టర్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో అంచ నాలు తయారు చేసి అందజేస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి రవికుమార్ హామీ ఇచ్చారు. దీంతో అంచనాలు తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలో ఎత్తి పోతల పథకం పనులు ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తుండటంతో రెండు గ్రామాల రైతులలో ఆశలు చిగురించాయి. రెండు గ్రామాల పొలాలు సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో చెరువులకు నీరు నింపాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పలపాడు ఎత్తిపోతల పథకం వచ్చే వ్యవసాయ సీజన్‌కు పనులు పూర్తయితే 2500 ఎకరాలకు సాగు నీటివసతి, రెండు చెరువులకు నీటిసమస్య తీరే అవకాశం ఉందని రైతులు అభి ప్రాయపడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకం పైపులు



నీరు తక్కువగా ఉన్న మైలవరం చెరువు

అద్దంకివాసులకు ఎన్‌టీఆర్ జాతీయ పురస్కారాలు

అద్దంకి, మే3(ఆంధ్రజ్యోతి):డాక్టర్ ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలు సందర్భంగా ఫిలాంత్రోఫిక్ సొసైటీ, రాజమహేంద్రవరం పాన్‌ఇండియాల ఆధ్వర్యంలో విజయవాడలో శనివారం నిర్వహించిన డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కారాల కార్యక్రమంలో అద్దంకికి చెందిన ముగ్గురు వ్యక్తులు అవార్డులు అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాలకు చెందిన 26 మంది డాక్టర్ ఎన్‌టీఆర్ జాతీయ పురస్కారాలు అంద జేయగా కళారంగం నుంచి అద్దంకికి చెందిన నందమూరి కళాపరిషత్ అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు, రాజకీయరంగం నుండి బాపట్ల జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, సేవా రంగం నుండి చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్రలు ఉన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అద్దంకి రాజా, డూండీ రాకేష్, చప్పి డి రాజశేఖర్ తదితరుల చేతుల మీదుగా డాక్టర్ ఎన్టీఆర్ జాతీయ పురస్కా రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురికి అద్దంకికి చెందిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



అవార్డులు అందుకుంటున్న మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణ, పెద్దినేని సురేంద్ర

విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం

- విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమంటూ ఆరోపణలు
- స్తంభంపైనే అరగంటపాటు మృతదేహం

పేరాల(చీరాల), మే 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ పనులు చేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ప్రమాదవశాత్తు స్తంభంపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతి చెంది, తీగలకు వేలాడాడు. ఈ హృదయ విదారక ఘటన శనివారం పేరాల జక్కావారివీధిలో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని విజయనగర్ కాలనీకు చెందిన జడ సునీల్(25) ప్రైవేట్ ఎలక్ట్రిషియన్. ఈక్రమంలోనే సహచరులతో కలిసి శనివారం పని చేస్తున్న సమయంలో తీగలకు విద్యుత్ సరఫరా జరి గింది. దీంతో మృతి చెంది తీగల పైనే సుమారు అరగంట పాటు వేలాడాడు. దీంతో స్థానికులు, సహచరులు శ్రమించి మృతదేహా న్ని తాడు సహాయంతో క్రిందకు దించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతునికి వ్యవసాయ కూలీ తల్లిదండ్రులు, ప్రయివేట్ వర్కర్‌గా పని చేస్తున్న సోదరుడు ఉన్నారు.



మృతదేహన్ని కిందకు దింపుతున్న సిబ్బంది

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- వజ్రాలవేట, కుటుంబఖర్చుల కోసం అప్పులు
- చికిత్స పొందుతూ మృతి

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): వజ్రాలు, రంగురాళ్లవేట, కుటుంబ ఖర్చులకు అప్పులు చేసింది. తీర్చేమార్గం లేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డ తన్నీరు అంజయ్య(54) చికిత్స పొందుతూ శనివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలేనికి చెందిన తన్నీరు అంజయ్య రంగురాళ్ళు, వజ్రాల వేటకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో కుటుంబఖర్చులకు అప్పులు చేశాడు. దీంతో గత నెల 29న గ్రామానికి సమీపంలో వెంకటేశ్వరరెడ్డి పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అంజయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఘటన

అద్దంకి, మే3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురానికి చెందిన ఇరువురు యువకులు మోటార్‌సైకిళ్లపై ఎదురెదురు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు శనివారం రాత్రి గోపాలపురానికి చెందిన కె.లింకన్ మోటార్‌సైకిల్‌పై చక్రాయపాలెం వైపు నుంచి గోపాలపురంలోకి వస్తున్నాడు. అదేగ్రామానికి చెందిన యర్రా హర్ష మోటార్‌సైకిల్‌పై వెళ్తుండటంతో ఎదురెదురు ఢీ కొన్నాయి. దీంతో హర్ష ప్రైవేట్ వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా, లింకన్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెట్టును ఢీకొన్న కారు

సంతమాగులూరు మే 3 (ఆంధ్రజ్యోతి) అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై అతివేగంగా వస్తున్న కారు ఏల్చూరు వద్దకు రాగానే ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాదు నుండి ఒంగోలు వెళ్తున్న కారు గ్రామంలోకి రాగానే అదుపుతప్పి చెట్టును ఢీ కొన్నది, కారులో ఉన్న ప్రయాణికులకు గాయాలుకావడంతో క్షేత్రగాతులను నరసరావుపేట జనరల్ హాస్పిటల్ తరలించారు



చెట్టును ఢీకొన్న కారు

గోవుల పరిరక్షణ అందరి బాధ్యత

చీరాల గోపరిరక్షణ సమితి ప్రతినిధులు

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : న్ోం ం లో ని మూగజీవులు గోవుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని చీరాల గోపరిరక్షణ సమితి ప్రతినిధులు అన్నారు. వేసవి ఎండలు కారణంగా పట్టణంలో తాగునీటికి గోవులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈక్రమంలో రెండు రోజులుగా పట్టణంలోని పలు ప్రధాన రహదారులు వెంబడి సమితి ఆధ్వర్యంలో నీటితొట్టెలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శబరి, బాలాజీ, రవిబాబు, శెట్టి, తారక రామారావు, శ్రీనివాస్, శంకరనారాయణ పాల్గొన్నారు.



నీటితొట్టెలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

పావులూరు తిరునాళ్లకు ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

ఇంకొల్లు,మే 3,(ఆంధ్రజ్యోతి) భక్తుల కొంగుబంగారంగా భావించే మండలంలోని ప్రసిద్ధి గాంచిన పావులూరు ఆంజనేయస్వామి తిరునాళ్ల ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంబించారు. వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు తలెత్తకుండా ఉండేవిధంగా ఆలయకమిటీ వారు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో తాటాకు చలువ పందిళ్లు వేస్తున్నారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా ఆంజనేయస్వామి తిరునాళ్ల నిర్వహించేందుకు పనులు జరుగుతున్నాయి. శనివారం భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేసవి సెలవులు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

యద్దనపూడి,(మార్టూరు)మే3(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన శనివారం మార్టూరు నుంచి గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి సమీపంలో చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రత్నకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన బట్టు రవికృష్ణ (38) సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అసోంలో ఉద్యోగం చేస్తూ సెలవు పెట్టి వారంరోజుల క్రితం స్వగ్రామమైన పూనూరులో ఇంటికి వచ్చారు. పూనూరు గ్రామం నుంచి స్కూటీపై మార్టూరు వస్తున్న రవికృష్ణ స్కూటీ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. దీంతో ఆయన తల రోడ్డును తాకి తీవ్రగాయమైంది. దీంతో ఆయన ఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్సై రత్నకుమారి ఘటనా స్థలానికి వచ్చి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా రవికృష్ణకు బల్లికురవ మండలం అంబడిపూడి గ్రామానికి చెందిన అనూషతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు దేవాన్ష్ వేద్‌రిక్వేద్‌లు ఉన్నారు. చిన్నకుమారుడు వేద్‌రిక్వేద్ మార్టూరులోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. పెద్దకుమారుడు దేవాన్ష్‌ను రోజూ ఆన్‌లైన్ తరగతుల కోసం రవికృష్ణ స్కూటీపై ఉదయం మార్టూరు తీసుకొచ్చి వదిలిపెడుతుంటాడు. అదేవిధంగా సాయంత్రం మార్టూరు వెళ్లి కుమారుని తీసుకువస్తుంటాడు. దీనిలో భాగంగా శనివారం ఉదయం మార్టూరులోని స్కూల్లో కుమారుడిని వదిలిపెట్టి వెళ్లి, సాయంత్రం ఇంటికి తీసుకొని వెళ్లడానికి పూనూరు నుంచి రవికృష్ణ మార్టూరు వస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదం చోటుచేసుకొందని ఎస్సై తెలిపారు.

ఉపాధి కూలీలకు పారదర్శకంగా సౌకర్యాలు

- అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ కోటయ్య నాయక్

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు పారదర్శకంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలు అందించాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరక్టర్ కోటయ్య నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని విజయగనర్ కాలనీలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మస్టర్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో దాసు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

మారుతీభవన్ మరమ్మతుకు విరాళం

అద్దంకి, మే3(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం రాతి ముఖమండపం పునర్ని ర్మాణం కోసం ముండ్లమూరు మండలం శంకరాపురా నికి చెందిన కూరపాటి ఏడుకొండలు, కోటేశ్వరమ్మ దంపతులు రూ.1,01,116, శింగరకొండ పాలెంకు చెందిన సురభి జకరయ్య రూ.10,116లను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. మారుతీభవన్ గదుల మరమ్మతులకు సంబం. దించి అద్దంకి పట్టణానికి చెందిన దామా హనుమంతరావు,జయలక్ష్మి దంపతులు, నుసుం పెద్దిరెడ్డి, విజయలక్ష్మి దంపతులు అవసరమైన సామగ్రి అందజేశారు.



చెక్కును అందజేస్తున్న ఏడుకొండలు

హక్కులపై అవగాహనతో ప్రజాప్రయోజనం

చీరాల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మానవహక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయాధికారి సుధ అన్నారు. శనివారం ఓ ప్రైవేటు వ్యాపార సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికహక్కులపై అవగాహన కల్పించారు. స్త్రీలకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఉన్నాయని ఇబ్బందికర పరిస్థితులలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్‌బాబు, స్నేహ, రామకృష్ణారెడ్డి, శివయ్య, మతీన్‌పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై పలువురు దాడి

- రూ.30 వేలు అపహరణ

ఈపూరుపాలెం(చీరాల), మే 3 (ఆంధ్రజ్యోతి) : మద్యంమత్తులో పలువురు ఓ వ్యక్తిపై దాడిచేసి రూ.30 వేలు నగదు అపహరించారు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బోయినవారిపాలేనికి చెందిన గోనబోయిన చిరంజీవి ఇటీవల చెరుకు వ్యాపారం చేసుకుని సంబంధిత నగదుతో గత గురువారం రాత్రి తోటవారిపాలెం మూడు రోడ్ల కూడలి నుంచి ఇంటికి వెళుతున్నాడు. ఈక్రమంలో పలువురు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి గొడవ పడ్డారు. అలాగే అతని వద్ద రూ.30వేలు నగదు అపహరించి దాడిచేశారు. దీంతో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందాడు. ఈ మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

నాడు - నేడు.. నాన్చుడు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్, తాగునీటి వసతి, పర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగతి గదులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు. భవనాలకు రంగులు తదితర పనులు అరకొరగానే సాగగా పెండింగ్ పనుల ఊసే లేకుండా ఏడాది ముగిసింది. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా పనులపై ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొరగానే పనులు పూర్తి..

- పల్నాడు జిల్లాలో 1298 పాఠశాలల్లో రూ.312 కోట్లు వ్యయ అంచనాతో 8,330 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 26 ప్యాకేజీల్లో మాత్రమే నిర్మాణాలు జరిగాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 352 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 91 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉండగా 29 మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 మాత్రమే పూర్తయ్యాయి. 913 మరమ్మతుల పనులకు 284 పూర్తి చేశారు.
- గుంటూరు జిల్లాలో 919 బడుల్లో రూ.203.94 కోట్ల వ్యయ అంచనాతో 6,523 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పది ప్యాకేజీల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. 100 పాఠశాలల్లో ప్రహరీలకు 25 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 264 పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 191 పూర్తి చేశారు.
- బాపట్ల జిల్లాలో 944 స్కూల్స్‌లో 183.31 కోట్ల వ్యయ అంచనాతో 6,274 చేపట్టాలని నిర్ణయించారు. 112 స్కూల్స్‌లో 96 ప్యాకేజీల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 163 చోట్ల పూర్తి చేశారు. 78 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు కాగా తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 327 పనులు చేపట్టగా 215, మరమ్మతుల పనులు 586 చేపట్టగా 157 మాత్రమే పూర్తి చేశారు.

ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి

- పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూపం ఏర్పాటు
- నలుగురు అధికారులతో విక్రయాలపై పర్యవేక్షణ
- ప్రతిరోజు కొనుగోలు తీరును పర్యవేక్షించనున్న అధికారులు

పర్చూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు రైతుల సమస్యలపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి ఎట్టకేలకు ఫలించింది. పొగాకు కొనుగోలుపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఆదేశాలు జారీచేశారు. బర్లీ పొగాకు కొనుగోలుపై పర్యవేక్షణ విక్రయాల తీరు తదితర అంశాలపై కంట్రోల్ రూం పనిచేస్తోంది. బర్లీ పొగాకు రైతుల సమస్యను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోయారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గత నెల 29న ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు రైతులు, రైతుసంఘాలు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. దీనికి తక్షణం స్పందించిన ప్రభుత్వం గుంటూరులోని పొగాకుబోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. దీనిలో పొగాకు, వ్యవసాయ అనుబంధ విభాగాల అధికారులతో మోనిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. గుంటూరు అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రమేష్, అగ్రికల్చర్ మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి జ్యోతి, టొబాకో ఫీల్డ్ ఆఫీసర్ ఎ.వంశీకృష్ణ, ఇండియన్ టొబాకో అసోషియేషన్ సభ్యుడు ఎన్.శ్రీనివాసరావులతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో పొగాకు రోజువారీ విక్రయాలను పర్యవేక్షించనున్నారు. బర్లీ పొగాకు కొనుగోలు చేసిన వివిధ పొగాకు కంపెనీల నుంచి అధికారుల కమిటీ ప్రతిరోజూ సమాచారాన్ని సేకరించి, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ప్రతి రోజూ సాయంత్రం 6గంటలకు నివేదికను అందజేయనున్నారు.



మంత్రి, రైతు సంఘాల నేతలతో ఏలూరి(ఫైల్)